

# మ్యూజికల్ మ్యూజింగ్స్



## - కస్తూరి మురళీకృష్ణ

జీవన్‌కీ బగియా మహెకేగీ లహెకేగీ, చహెకేగీ

ఖుషియోంకి కలియా, ఝూమేంగీ, ఝూలేంగీ, ఫూలేంగీ

సాధారణంగా మన సినిమాల్లో దంపతులు సంతానం గురించి ఊహిస్తూ పాడే పాటలలో, భార్యభర్తలు తమ సంతానానికి ఎలాంటి పోలికలు రావాలి? వాడు ఎదిగి ఏమవాలి? వంటి విషయాల గురించి ఊహిస్తూ పాడతారు. ఒకరిపై ఒకరు చమత్కార బాణాలు విసురుకుంటారు. కానీ కవి నీరజ్ ఇలాంటి సందర్భంలో అత్యద్భుతమైన గేయాన్ని రచించాడు. 'తేరే మేరే సప్నె' సినిమాలోని ఈ పాట సినీగీతాల స్థాయిని పెంచి, సినీగీతాన్ని సాహిత్యం స్థాయికి ఎదిగించే పాట.

నాయికా, నాయకులు తమకు కలగబోయే సంతానం గురించి సంతోషంగా పాడుకునేపాట ఇది. వారి జీవితపు పూలతోట ఆనందంతో ఉగ్రూతలూగబోతోందట. పరిమళాలు వెదజల్లుతూ ఉయ్యాలలూగబోతోందట. ఆ పూదోటలో ఆనందపు పుష్పాలు ఉగ్రూతలూగుతు వెల్లివిరుస్తాయట. ఇది పల్లవి. జీవితపు పూదోటలో ఆనందపుష్పాలు పూస్తున్నాయని సంతోషంగా పాడుకుంటున్నారన్నమాట.

వో మేరా హోగా, వో సప్నా తేరా హోగా

మిల్‌జుల్‌కే మాంగా, వొ తేరామేరా హోగా

జబ్ జబ్ వో ముస్కురాయేగా, అప్‌నా సవేరాహోగా

ఇటీవలి కాలంలో కొందరు తాము హేతువాదులమని చెప్పుకుంటూ ప్రతి విషయాన్ని వికృతంగా, దుర్వ్యాఖ్యానం చేస్తూ, జీవితంలోని ఆనందకరమూ, సున్నితమైన అంశాలన్నిటినీ జుగుప్సాకరం చేస్తున్నారు. భార్యాభర్తల సంబంధం అలాంటి అంశాలలో ఒకటి. వైవాహిక బంధాన్ని ఎంతగ అవహేళన చేయాలో, ఎంతగా దిగజార్చి చూపాలో అంతగా చూపి కాలర్లెగరేస్తున్నారు. దాంపత్య సంబంధంలోని సున్నితత్వము, ఔన్నత్యము అత్యంత మధురమూ అయిన అంశం సంతానం. ఇరువురి కలయికవల్ల ఫలించే పుష్పం సంతానం 'ఒక తరాన్ని ప్రసవించటమంటే తమాషాకాదు, ఒక నిండు కలల జగత్తునే మేల్కొలపటం' అంటారు కవి శేషేంద్రశర్మ. తల్లిదండ్రుల తపస్సు ఫలితం సంతానం అంటుంది భారతీయ తత్వం. దంపతుల కలయికను కేవలం భౌతిక దృష్టితో చూసి, సంతానాన్ని 'అనుకోకుండా జరిగిన పొరపాటు'గా భావించి వ్యాఖ్యానించే ఆధునిక తెలివిమంతులకు నీరజ్ వ్యక్తపరచిన భావనలు బండరాయిపై పడిన పన్నీటి జల్లులాంటిది.

'వివాహం'అనేది ఇద్దరు అపరిచితులను ఆత్మీయులను చేస్తుంది. జీవిత ప్రయాణంలో భాగస్వాములను చేస్తుంది. అందుకే ఓ హింది సినీ కవి వివాహమయిన తరువాత భార్యను ఇంటికి తీసుకు వెళ్తూన్న భర్తతో 'కల్‌తక్ జో బేగానే థే, జన్మోంకె మీత్ రే' అనిపించాడు. నిన్నటి వరకూ అపరిచిత అయిన వ్యక్తి ఈనాడు జన్మ జన్మల ప్రియతమగా మారిందట. ఎంత అద్భుతమైన భావన. ఇదీ వివాహ సంబంధం. దాంపత్య సంబంధంలోని ఔన్నత్యాలు, ఉత్తమమూ, సున్నితమైన విషయాలు తెలియని వారు వివాహ వ్యవస్థను దూషిస్తూ, ప్రతి విషయానికీ దోషిగా చూపిస్తూ, తమ ప్రేమ రాహిత్య భావనను ప్రదర్శించుకుంటున్నారు. ఇక్కడ నీరజ్ అలతి అలతి పదాలతో భార్యా భర్తల సంబంధంలోని

గొప్పతనాన్ని ప్రదర్శిస్తున్నాడు. తమకు పుట్టే సంతానం 'ఒక స్వప్నం' అట. ఆ స్వప్నం ఆకారం ధరించి వస్తుంది. ఆ స్వప్నం కేవలం భార్యదో, భర్తదో మాత్రమే కాదు. 'మిల్ జుల్ కే మాంగా', ఇద్దరూ కలసి సమ్యుక్తంగా కన్న స్వప్నం, కోరిన కోరిక సంతానం. సంతానాన్ని కేవలం లైంగిక చర్య ఫలితంగా చూసే ఆధునిక ఇంటలెక్చువల్‌స్‌కు సంతానం 'తపస్సు ఫలితం' అంటే అర్ధం కాదు. మరో సినీకవి 'మై తేరే దిల్ మే థీ హమేషాసే, ఘర్‌మె అయీ హు ఆజ్ పహలీ బార్ ' అనిపిస్తాడు సంతానంతో. ప్రతి వ్యక్తి హృదయంలో ఒక అస్పష్టమైన రూపంలో సంతాన భావన ఉంటుంది, స్త్రీ అయినా, పురుషుడు అయినా. ఆ సంతాన భావన వ్యక్తి అనుభవాలు, ఆలోచనలు, సంస్కారం వంటి అనేక అంశాల ఆధారంగా వ్యక్తికే తెలియని రీతిలో ఏర్పడుతుంది. 'సంతానాన్ని' కనటం అనేది భార్యాభర్తలిద్దరూ కలసి కన్న కల ఫలితం. సంతానాన్ని కనటం ద్వారా స్త్రీ, పురుషులు బ్రహ్మ సమానులవుతారు. అదొక యజ్ఞం. దేవరకొండ బాల గంగాధర తిలక్ అందుకే స్త్రీ పురుషుల సమాగమాన్ని

**'ఇది సృష్టి**
**ఇది మిధస్సమాశ్లేష చకిత తనుయష్టి**
**నేనొక పరిమేష్టి**
**ఇది నీవు, ఇది నేను**
**ఇరువురుమూ ఒకటయిన నిమేషమ్ము**

అని అత్యద్భుతంగా వర్ణించాడు. అంటే ఏదయితే ఒక 'జంతుచర్య'గా మన తెలివిమంతులు దిగజారుస్తున్నారో, అది వ్యక్తిని పరమేష్టిగా ఎదిగించే చర్య అన్నమాట. అది వ్యక్తి సంస్కారం, వ్యక్తిత్వం సర్వాన్ని ప్రతిబింబించే మహత్తరమైన కార్యం అన్నమాట. ఇరువురు వ్యక్తులు తమ జీవితాన్ని మాత్రమే కాదు ఆశలు, ఆశయాలు, వేదనలు, నిరాశలు అన్నీ కలిపి ఏర్పరచిన మరో నూతన ప్రపంచం సంతానం. అందుకే శేషేంద్రశర్మ "నిండు కలల జగత్తు" అన్నాడు.

**థోడా హమారా, థోడా తుమ్హారా**
**ఆయేగా ఫి సే బచ్‌పన్ హమారా**

అంటాడు నీరజ్. 'కాస్త నాది, కాస్త నీది కలగలసి మన బాల్యం తిరిగి వస్తోంది' అంటాడు నాయకుడు. అద్భుతం అనిపిస్తుంది. సంతానం ద్వారా ఒక తండ్రి బాల్యమో, తల్లి బాల్యమో కాదు ఇరువురి బాల్యం తిరిగి ఊపిరిపోసుకుంటుంది. అంతేకాదు అలా ఊపిరి పోసుకున్న ఆ నిండు కలల జగత్తు ఇద్దరి లక్షణాలను వారసత్వంగా పొందినా తనదైన ప్రత్యేక వ్యక్తిత్వం కలిగి ఉంటుంది. ఆ అద్భుతం దాంపత్య ఫలం. ఇంకా లోతుగా వెళ్లి చూస్తే, భార్యాభర్తలు కలుస్తున్నప్పుడు భౌతికంగా ఇద్దరు వ్యక్తులు ఏకమవుతున్నట్టు కనిపిస్తుంది కానీ స్త్రీ, పురుషుల ద్వారా అనేక గతించిన తరాలు కలసి ఒక నూతన తరం ఆవిష్కృతమవుతుంది. 'ఎన్నో అవ్యక్తాత్మలు చిత్రవిచిత్రానుభూతుల ఒడిలో స్పందన పొందిన తరుణాల స్వరాలు ఈ తరాలు' అంటాడు శేషేంద్ర శర్మ. 'ఎన్నో అవ్యక్తాత్మలు', వైజ్ఞానికంగా కూడా ఒక వ్యక్తి కళ్లముందు నిలిచాడంటే, అతడిలోని అనేకానేక తరాల వ్యక్తుల 'లక్షణాలు' జీన్స్ ద్వారా అందినవి, అతడిలో ఉండి అతడి ప్రవర్తనను, నిర్దేశిస్తున్నాయని అర్ధం. ఎంత అద్భుతమైన విషయం. అందుకే యవ్వనంలో 'మై పల్ దో పల్ కా షాయర్ హూ' అనుకున్నవాడు వృద్ధాప్యం వచ్చి పరిణతి పొందేసరికి 'మై హర్ ఇక్ పల్ కా షాయర్ హూ' అంటాడు. యవ్వనంలో జీవితం క్షణికం అనిపిస్తుంది. కానీ సంతానం కలిగిన తరువాత ఆ సంతానంలో తానేకాదు తన పాత తరం వారందరూ సజీవంగా కనిపిస్తూంటే, తాను కూడా ఇలా తరతరాలు భౌతికంగా నశించినా లక్షణాల ద్వారా సజీవంగా ఉంటానని అర్ధమైన తరువాత తాను 'అనంతుడు' అని గ్రహిస్తాడు. తన ప్రతి చర్య ప్రభావం రాబోయే అనేక తరాలపై ఉంటుందని బోధపడుతుంది. అప్పుడు తాను 'క్షణికుడు' అన్న భావన అదృశ్యమవుతుంది. ఇదీ దాంపత్య సంబంధం స్వరూపం.

– అందుకే కవి 'ఆ యె గా ఫిర్ సే బచ్‌పన్ హమారా' అనిపించాడు నాయికా నాయకులతో. ఇదీ నీరజ్ కవిత రచన స్వరూపం.

ఈ పాటను దేవానంద్‌కి కాబట్టి కిషోర్ కుమార్ ప్రత్యేకంగా పాడాడు. లత ప్రతి పాటా ప్రత్యేకమే. అందంగా ఎస్డీ బర్మన్ స్వర పరిచాడు. ఈ పాటను విజయ్ ఆనంద్ పరమ రమణీయంగా చిత్రించాడు.

ఎస్డీ బర్మన్ కు రచించిన పాటలలో నీరజ్ కవిత విశ్వరూపం దర్శనమిస్తుంది. ఇందుకు కారణం ఎస్డీ బర్మన్ గేయ రచయితకు స్వేచ్ఛనివ్వటమే.

**ఖిల్ తె హై గుల్ యహా, ఖిల్‌కె బిఖర్నె కో**

**మిల్ తె హై దిల్ యహా, మిల్ కె బిఛడ్ నెకో**

'షర్మిలి' సినిమాలోని ఈ పాటను ఆనందిస్తూ పాడని వ్యక్తి ఉండడు. అత్యంత సున్నితమూ మధురమైన భావాలను ఈ పాటలో పొదిగాడు నీరజ్.

**ఝీలోంకె హోఠోం పర్, మేఘోంక రాగ్ హై**

**ఫూలోంకె సీనేమే ఠండి ఠండి ఆగ్ హై**

**దిల్ కి ఆయినేమె తూ, యే సమా ఉతార్‌లో**

'నదుల పెదవులపై మేఘాల రాగాలున్నాయట.' ఒక సుందరమైన చిత్రాన్ని మన కళ్లముందు ప్రదర్శిస్తున్నాడు కవి. నిశ్చలమైన నీటిలో ఆకాశం ప్రతిబింబిస్తుంది. అది 'నదుల పెదవులపై మేఘాల రాగం'లా తోస్తోంది కవికి. పూవుల హృదయాలలో శీతలమైన అగ్ని ఉందట. ప్రతి స్త్రీ ఒక పువ్వులాంటిది. ఆమె హృదయంలోని భావనలు అంత సులభంగా వ్యక్తం కావు. 'ఠండా ఠండా ఆగ్' అన్నమాట.

ఈ భావననే సాహిర్ లూథియాన్వీ మరో రకంగా వ్యక్తపరచాడు

**సునాహై హర్ జవా పత్థర్ కె దిల్‌మె ఆగ్ హోతీ హై**

**మగర్ జబ్ తక్ నా ఛేడో షర్మగీ పర్ దేమె సోతీ హై**

పైకి రాయిలా, నిర్మోహంగా, ఏమీ పట్టనట్టు కనిపించే యువతి హృదయంలో అగ్ని నిద్రాణ స్థితిలో ఉంటుంది అగ్ని అంటే 'ప్రేమాగ్ని'. దాన్ని ఎవరైనా తట్టి లేపేవరకూ అది 'సిగ్గు' అనే పరదాలో నిద్రాణ స్థితిలో ఉంటుందట. ఇదే భావనను మరింత సున్నితంగా, కవితాత్మకంగా 'ఫూలోంకె సీనేమే, ఠండి ఠండి ఆగ్ హై' అంటూ ప్రకటించాడు కవి నీరజ్.

'షర్మిలి' సినిమాలోనిదే 'మేఘా ఛాయే అధీరాత్ బైరన్ బన్ గయి నిందియా' పాటలో నీరజ్ అత్యద్భుతమైన పదాలను వాడుతూ అత్యంత దుర్భరమైన విషాదాన్ని అందంగా ప్రదర్శించాడు.

**సబ్ కి అంగన్ దియా జలేరే, మెరే ఆంగన్ జియా**

అందరి ఇళ్ల ముందు దీపాలు వెలుగుతూంటే (దియా), ఆమె ఇంటి ముంగిట్లో ఆమె హృదయం కాలుతోందట (జియా). దియ, జియ పదాలతో ఎంత విరుద్ధమైన భావనను ఎంత అద్భుతంగా సృజించాడో!

**హవాలాగే శూల్ జైస, తానమారె చునరియా**

**గాలి కత్తితో కోస్తున్నట్టుంటే, ఆమె కొంగు ఆమెను మోదుతోందంట.**

**ఆయీ హై ఆసూ కీ బారాత్**

కంటి నీటి ప్రవాహం కారుతోందంట. బారాత్ అంటే procession. ఇక్కడ కంటినీటి ప్రవాహం.

రూఠ్ గయెరె సప్నెసారే , టూట్ గయిరే ఆశా
నై బహెరే గంగ, మోరే ఫిర్ భి మన్ హై ప్యాసా
కిసె కహూరె మన్ కి బాత్

అద్భుతం. ఆమె కలలన్నీ ఆమెని వీడి వెళ్లిపోయాయట. ఆశ నశించిపోయింది. కన్ను గంగా ప్రవాహమయింది. అన్ని నదులలోకీ అత్యంత వేగంగా ప్రవహిస్తుంది గంగానది. కానీ ఆమె మనస్సు దాహంతోటే ఉంది. ఎవరితో మనసులో మాట చెప్పుకోవాలి? అంటోంది నాయిక.

ఈ పాటను ఎస్డీ బర్మన్ రూపొందించిన తీరు పరమాద్భుతం. షర్మిలి సినిమాలో మంచి రాఖీ, అల్లరి రాఖీ ఉంటారు. శశికపూర్ పాత్ర అల్లరి రాఖీని చూసి, మంచి రాఖీని ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు అల్లరి రాఖీ అనుకుని. నిజం తెలిసిన తరువాత ఆమెని వదిలి వెళ్తాడు. ఆ సందర్భంలో ఈ పాట పాడుతుంది మంచి రాఖీ. పాట చిత్రీకరణలో చరణాల నడుమ సంగీతం (ఇంటర్ల్యూడ్) వచ్చేప్పుడు అల్లరి రాఖీ, శశికపూర్‌లు ఆనందించే దృశ్యాలు చూపుతారు. వెంటనే ఒంటరిగా రోదించే రాఖీ పాత్ర వచ్చి పాడుతుంది. ఈ contrast, భిన్న భావాలను తన సంగీతంలో ప్రదర్శిస్తాడు ఎస్డీ బర్మన్.

పాటను పట్‌దీప్ రాగంలో రూపొందించాడు. కర్ణాటక సంగీతంలో 'గౌరి మనోహరి', పట్‌దీప్ రాగానికి సమానమైన రాగం. పట్‌దీప్ రాగం ఉచ్చస్థాయి ఉంటుంది. అందుకే చరణాలు ఉచ్చస్థాయిలో ఉండి, పాటలోని 'వేదన' భావాన్ని 'రోదన'ను మరింత ప్రతిభావంతం, తీవ్రతరం చేస్తాయి. అల్లరి రాఖీ కనిపించినప్పుడు పాశ్చాత్య తరహా బాణీని, మంచి రాఖీ కనిపించేటప్పుదు శాస్త్రీయ సాంప్రదాయ సంగీతాన్ని వినిపించి ఎస్డీ బర్మన్ సంగీతం ద్వారా పాత్రల వ్యక్తిత్వాలను ప్రస్ఫుటం చేస్తాడు. గిటార్, అకార్డియన్, బోంగో, డ్రమ్స్ వంటి పాశ్చాత్య వాయిద్యాలతో ఆరంభించి సితార్, తబల, వయోలిన్, వేణువు సారంగి వంటి సంప్రదాయిక వాయిద్యాలతో ముగిస్తాడు. పాట 'లయ' కూడా ఎంతో ఆలోచించి ఏర్పాటు చేయటం తెలుస్తుంది. సాంప్రదాయ బద్ధమైన భాగంలో ఏడు బీట్ల రూపక తాళం తబలాతో కలసి వచ్చి అద్భుతమైన భావనను కలిగిస్తుంది. ఇదే పాశ్చాత్య బాణీ వచ్చేసరికి ఎనిమిది బీట్లతో ఊపేస్తుంది. కేవలం 'లయ 'ను మార్చటం వల్ల 'మూడ్'ను మార్చే ప్రక్రియను ఈ పాటలో గొప్పగా ప్రదర్శించాడు ఎస్డీ బర్మన్. లతా పాడటం గురించి ఎంత చెప్పినా తక్కువే. సరస్వతి! అంతే.

ఇలా సినిమాలో ఒక మూడు నిముషాలుండే పాటలో ఓ వైపు అత్యద్భుతమైన సాహిత్యం, మరో వైపు సంగీతంలో ప్రయోగాలు, గానం ఇలా కళాకారులు తమ ప్రతిభనంతా కుప్పపోసి ఒక బంగారం వంటి అమూల్యమైన కళాసృష్టిని సమాజం ముందు నిలిపారు. అనుభవించిన వారికి అనుభవించినంత ఆనందం.

*(వచ్చే నెల మరిన్ని మధురమైన గీతాలతో)*

Post your comments